క్లుప్తంగా

డేట్ లిఫ్ట్ చాంపియన్ మందపల్లికి కలెక్టర్ అభినందన



మందపల్లి శ్రీనివాసరావును అభినందిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: రాష్ట్రస్థాయి డేట్ లిఫ్ట్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన స్థానిక ఆర్టీసీ డిపో డ్రైవర్ మందపల్లి శ్రీనివాసరావును కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం అభినందించారు. ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం పెదగంట్యాడలో గత నెల 8, 9 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో 195 కిలోల విభాగంలో శ్రీనివాసరావు ఈ ఘనత సాధించారు. అలాగే పవర్ లిఫ్టింగ్ బ్యాక్ స్క్వాడ్‌లో 180 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. దీంతో ఆయన కలెక్టర్ షాన్ మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రం నుంచి అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించడం ప్రశంసనీయమని శుభాకాంక్షలు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: కాకినాడ డీ7 సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించడానికి 33/11 కేవీ డైరీఫామ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ బుధవారం తెలిపారు. దుమ్ములపేట, రాజీవ్ గృహకల్ప బ్లాక్స్, తారకరామనగర్, సత్యనగర్, డీ2 సెక్షన్ పోర్టు ఇండస్ట్రియల్ ఏరియా, డైరీఫారం, రాజీవ్ గృహకల్ప బ్లాక్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులందరూ ఈ అంతరాయానికి సహకరించాలని ఈఈ ప్రసాద్ కోరారు.

విద్యతో పేదరికంపై విజయం



కళాశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు

బాలాజీచెరువు: విద్యను బాగా అభ్యసించి ఉన్నత స్థితికి చేరుకోవడం ద్వారా పేదరికాన్ని జయించవచ్చని ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పీఆర్ ఒకేషనల్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ కళాశాలలో చదువుకునే వారందరూ బాగా చదువుకుని కళాశాలతో పాటు తల్లిదండ్రులకు పేరు తీసుకువరావాలని సూచించారు. అనంతరం స్వచ్ఛ భారత్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మావూరి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కాకినాడ సిటీ: కాకినాడ పోర్టు పరిశ్రమల్లో 30 ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నా నేటికీ కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ అన్నారు. బుధవారం పోర్టు పరిశ్రమల్లోని కాంట్రాక్ట్ కార్మికులు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో పారిశ్రామికవాడలో నిరసన తెలియజేసి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేసుకుని ధర్నా చేశారు. కనీస వేతనం రూ.20 వేలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ బోనస్ లాంటి కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, శివకోటి రాజు, మంగ తదితరులు పాల్గొన్నారు.

చెస్ కోచ్ సురేష్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న చెస్ కోచ్ సురేష్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ నగరానికి చెందిన చీఫ్ చెస్ కోచ్ ఉద్దిన చైతన్య సురేష్ మలేషియాలోని ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఫ్రాన్స్ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారని ఏపీ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు బుధవారం తెలిపారు. ఇండోగ్లోబల్ సమ్మిట్ అవార్డులో భాగంగా ఈ నెల 9న మలేషియాలో జరిగిన కార్యక్రమంలో ఆయన చైల్డ్ సైకాలజీ ఇన్ రెఫరెన్స్ ఆఫ్ చెస్ అనే అంశంపై పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చారన్నారు. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసిన ఆయన ఉభయ రాష్ట్రాల్లో వేలాది మంది చిన్నారులకు చెస్‌లో తర్ఫీదు ఇస్తున్నారన్నారు. ప్రఖ్యాత విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్న సురేష్‌ను చిట్టిబాబు అభినందించారు.

సార్వా సిరులొలికించాలని..

- కోటి ఆశలతో సాగుకు సమాయత్తం
- ఇప్పటికే వరి నాట్లు ప్రారంభం
- ఆలస్యమైన చోట వెదజల్లుకే ప్రాధాన్యం



వేళంగిలో వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు



పెద్దాపురప్పాడులో వెదజల్లిన పొలం



సిరిపురంలో సార్వాకు దమ్ముచేస్తున్న ట్రాక్టర్

కరప: తొలకరి జల్లులు పడుతుండటంతో రైతులు కోటి ఆశలతో సార్వాకు సమాయత్తమయ్యారు. మండలంలో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది సార్వా సీజన్ త్వరగా ప్రారంభించి జూలై నెలాఖరు నాటికి వరినాట్లు పూర్తి చేయాలని రైతులకు అధికారులు సూచించారు. దానికి అనుగుణంగా జూన్ ఒకటో తేదీనే కాలువలకు సాగునీరు వదిలారు. నైరుతి రుతుపవనాలు మొండికేయడం, అధిక ఎండలకు జడిసి రైతులు నారుమళ్లు వేయడంలో రెండు వారాలు ఆలస్యం చేశారు. కాలువల మొగలో ఉన్న రైతులు, బోర్లు ఉన్న గ్రామాల్లోను సంప్రదాయ పద్ధతిలో వరినాట్లు వేసేందుకు నారుమడులు వేసుకున్నారు. మరికొందరు వెదజల్లు సాగుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలో 14 వేల ఎకరాల్లో వరి సాగుచేస్తారు. వారం రోజులుగా ఆకాశం మబ్బులు పట్టి చిరుజల్లులు పడుతుండడంతో రైతులు వ్యవసాయ పనులు చేపట్టారు. ముందుగా వేసిన నారుమళ్లు ఏపుగా పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో కాలువల్లోని నీటిని మడుల్లోకి మళ్లించి రైతులు దమ్ములు చేయించుకుంటున్నారు. వరి నారు పెరుగుదలతో వరినాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. వేళంగి, సిరిపురం, పెద్దాపురప్పాడు, వేములవాడ, వాకాడ, కూరాడ, అరట్లకట్ట తదితర గ్రామాల్లో వరినాట్లు ప్రారంభమయ్యాయి. కూలీ రేట్లు కూడా గతయేడాది కంటే పెరిగాయని రైతులు అంటున్నారు. మగవారికి రూ.800 నుంచి రూ.వెయ్యి, మహిళా కూలీలకు రూ.500 నుంచి రూ.600 వంతున తీసుకుంటున్నట్టు రైతులు తెలిపారు. వర్షాలు కురవకపోయినా మబ్బులుపట్టి చల్లగా ఉంటే సార్వా పనులు సజావుగా సాగుతాయని రైతులు అంటున్నారు. వాతావరణం చల్లగా ఉంటే ఊడ్చిన చేలు త్వరగా మూనదేరి, దుబ్బు చేస్తాయని రైతులు పేర్కొంటున్నారు. రెండు, మూడు వారాల పాటు అధిక వర్షాలు పడకుండా వాతావరణం అనుకూలిస్తే సార్వా నాట్లు ఎటువంటి ఒడుదుడుకులు లేకుండా సాగుతాయని రైతులు భగవంతునిపై భారం వేస్తున్నారు.

వెదజల్లు సాగుకు మొగ్గు

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వెదజల్లు సాగుకు సమాయత్త మవుతున్నారు. నారుమళ్లు వేసుకోలేని ప్రాంతాల్లో వెదజల్లు సాగు చేస్తున్నట్టు రైతులు అంటున్నారు. కాలువలకు ముందుగానే నీరు వదిలినా నైరుతి పవనాలు రాక ఆలస్యం కావడంతో వర్షాలు పడక నారుమళ్లు వేయడం ఆలస్యమైంది. దీంతో వెదజల్లు పద్ధతి అనుసరిస్తే సమయం కలిసివస్తుందని కొందరు రైతులు నారుమళ్లు వేసుకోలేదు. నారుమళ్లు వేసుకోని రైతులు వెదజల్లుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సాధారణంగా సార్వా సీజన్‌లో వెదజల్లు కంటే సాంప్రదాయ పద్ధతిలో వరినాట్లకే రైతులు మొగ్గు చూపుతారు. వెదజల్లిన వారం రోజుల్లో వర్షాలు పడితే పొలాలు దెబ్బతింటాయని అందుకే సంప్రదాయ పద్ధతిలో నారుపెంచి, ఊడుస్తారు. సాధారణంగా ఊడ్చే పొలాల కంటే వెదజల్లిన పొలాలు రెండు వారాలు ముందుగా కోతకు వస్తుంది. ఈ యేడాది చాలా మంది రైతులు వెదజల్లుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. పాతర్లగడ్డ, గొర్రిపూడి, విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు, యండమూరు, సిరిపురం, వేళంగి, వలసపాకల, జి.భావారం తదితర గ్రామాల్లో వెదజల్లు సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. పెట్టుబడులు ఆదా అవుతాయని కొందరు రైతులు బెంగాల్ ఊడ్పులను అనుసరిస్తున్నారు. బెంగాల్ కూలీలే వరినారు, తీసి, నాట్లు వేసేందుకు ఎకరానికి రూ.3,500 తీసుకుంటున్నారు. అదే సంప్రదాయ పద్ధతిలో అయితే నారుతీసి, నాట్లు వేసేందుకు రూ.10 వేలు ఖర్చవుతుందని రైతులు తెలిపారు.

విత్తన శుద్ధి చేయాలి



నారుమళ్లు వేసుకుని వెదజల్లు సాగును అనుసరిస్తే సమయం, పెట్టుబడులు ఆదా అవుతాయి. తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. విత్తనాలు నానపెట్టి మొలకవచ్చిన తర్వాత మడుల్లో బురదపదునుపై చల్లాలి. ఒకరోజు తర్వాత నీరుదింపి, రెండురోజులు ఆరనిచ్చి మళ్లీ నీటితడి పెట్టాలి. తర్వాత వారం రోజుల వ్యవధిలో కలుపు నివారణకు మందులు పిచికారీ చేసి, వ్యవసాయశాఖ సిఫార్సుల మేరకు ఎరువులు వాడితే వరిచేలు దుబ్బు చేసి, ఏపుగా పెరుగుతాయి. వెదజల్లులో కలుపు నివారణకు యాజమాన్యపద్ధతులు పాటిస్తే అధికదిగుబడులు సాధించవచ్చు. సార్వాసీజన్‌లో 70 శాతం మేర ఎంటీయూ 7629, 28 శాతం ఎంటీయూ 1318, మిగిలిన విస్తీర్ణంలో ఎంటీయూ 1282 రకాన్ని సాగుచేస్తున్నారు. ఇంత వరకు 160 హెక్టార్లలో వరినాట్లు వేయగా, 270 హెక్టార్లలో వెదజల్లు సాగుచేశారు. 4,500 హెక్టార్లలో దమ్ములు పూర్తయ్యాయి.

– ఏవీ రాజేష్, ఎంఏఓ, కరప మండలం

పెట్టుబడులు ఆదా



తొలకరి ఆలస్యం కావడంతో వెదజల్లు పద్ధతి అనుసరిస్తున్నాం. సాగులో పెట్టుబడులు ఆదా అవుతున్నాయి. వరినారు పెంచడం, ఆకుతీత, ఊడ్పులకు అయ్యే ఖర్చు తగ్గుతుంది. వర్షాకాలంలో ముంపు బెడద ఉన్నా వెదజల్లు పద్ధతిలో సాగుచేస్తున్నాం. సాగుఖర్చు తగ్గించేందుకు వ్యవసాయశాఖ సూచనల మేరకు కలుపు నివారణ, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నాం.

– రెడ్డి శ్రీనివాస్, కొలురెతు, యండమూరు

ఆ రెండు చెట్లూ హానికరమే



కాకినాడ ఎన్జీఓహోం వీధిలో ఏపుగా ఎదిగిన కోనోకార్పస్ చెట్లు

బోట్‌క్లబ్: కోనోకార్పస్‌ను విషవృక్షంగా, ఏడాకుల చెట్టును డెవిల్ ట్రీగా గుర్తించి ప్రపంచ దేశాల్లో, పలు రాష్ట్రాల్లో తొలగిస్తున్నారని పౌరసంక్షేమ సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమరాజు అన్నారు. ఆయన బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నగరంలో 35 వేల కోనోకార్పస్ చెట్లు, 150 ఏడాకుల చెట్లు ఉన్నాయన్నారు. నగరంలో ప్రమాదకర చెట్ల విషయం పర్యాటకశాఖమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా కార్పొరేషన్ అధికారులు కోనోకార్పస్ పేరిట ఏడాకుల చెట్ల తొలగింపుపై మాత్రమే దృష్టి సారిస్తున్నారన్నారు. కోనోకార్పస్ మొక్కలను స్మార్ట్ సిటీ ప్రారంభం 2017లో కౌన్సిల్ ఎన్నికలు జరగక ముందు రూ.5 కోట్లతో 35 వేల మొక్కలు నాటగా ఏడేళ్లలో వృక్షాలుగా తయారయ్యాయన్నారు. నగర వ్యాప్తంగా పెరిగిన ఈ చెట్లపై ఏ పక్షులు వాలవని పక్షులు గూళ్లు పెట్టవని, పశువులు తినవని, వీటి వేర్లు భూగర్భ జలాలను మట్టి పొరల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటాయని పేర్కొన్నారు. ఈ చెట్లను తొలగించి వేప చెట్లు పెంచాలని డిమాండ్ చేశారు.

డిమాండ్ల సాధనకు కార్మికుల ఆందోళన



కాకినాడలో ర్యాలీ నిర్వహిస్తున్న స్కీం వర్కర్లు



కరపలో డీటీ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు తదితరులు

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సీఐటీయూ ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం కాకినాడ మెయిన్‌రోడ్డు హెడ్ పోస్టాఫీసు వద్ద కార్మికుల కోర్కెల దినం నిర్వహించారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి నరేంద్రమోడీ అధికారం చేపట్టారని, కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నినాదాలు చేశారు. కాకినాడ నగరంలో షాపింగ్ మాల్స్‌లో పని చేసే కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సీహెచ్ రాజ్‌కుమార్, మలకా వెంకటరమణ, పలివెల వీరబాబు, ఈ చంద్రావతి, దుంపల ప్రసాద్, భారతి, సి వెంకటరావు, శేషు, అనపర్తి ఏడుకొండలు తదితరులు పాల్గొని మాట్లాడారు.

కరపలో ధర్నా

కరప: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజనపథకం కార్మికులు, స్కూలు స్లీపర్లు ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ పిలుపు మేరకు మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు బుధవారం కరప తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ కె.అనిల్‌కుమార్‌కు అందజేశారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు పి.వీరవేణి, సెక్టార్ లీడర్లు ఎస్.వరలక్ష్మి, ఎం.భవాని, ఎం.దేవి తదితరులు పాల్గొన్నారు.

పొలంబడితో రైతులకు మేలు



నేమాంలో పొలంబడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ పద్మశ్రీ

కాకినాడ రూరల్: పొలంబడి ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, ముఖ్యంగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని ఏడీఏ పద్మశ్రీ, ప్రకృతి వ్యవసాయ అధికారి ఇలియాజర్, జిల్లా వనరులకు కేంద్రం అధికారి మాధవి పేర్కొన్నారు. మండలంలోని నేమాం గ్రామంలో వ్యవసాయ అధికారి చీకట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం రైతు సేవా కేంద్రంలో పొలంబడి నిర్వహించి ఖరీఫ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ పద్మశ్రీ పొలంబడి ఆవశ్యకత, ఉద్దేశాన్ని రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయాధికారి ఇలియాజర్ ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయం గురించి వివరించి వాటి వల్ల లాభాలు, మానవులకు కలిగే మేలును తెలియజేశారు. జిల్లా వనరులకు కేంద్రం అధికారి మాధవి సేంద్రియ వ్యవసాయం, సమగ్ర ఎరువుల యాజమన్యం గురించి వివరించారు. ఆర్గానిక్ సర్టిఫికెట్లు ఏవిధంగా పొందాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, ఏఈఓ మూర్తి, వీఏఏ పాల్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేశా



బాధ్యతలు స్వీకరించిన అగర్వాల్, పదవీ విరమణ పొందిన సబ్యసాచి దాస్‌లతో ఎన్‌సీసీ సభ్యులు

- గ్రూప్ కమాండర్ కల్నల్ దాస్

కాకినాడ రూరల్: వృత్తిపట్ల అంకితభావంతో పని చేసి పదవీ విరమణ చేయడం ఆనందంగా ఉందని కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ సబ్యసాచి దాస్ అన్నారు. స్థానిక అశోక్ నగర్ కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్‌లో దాస్ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. అంతకు ముందు దాస్ స్థానంలో గ్రూప్ కమాండర్‌గా నియమితులైన రితిన్ మోహన్ అగర్వాల్‌కు బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఎన్‌సీసీ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ స్టూడెంట్స్‌తో గార్డ్ ఆఫ్ హానర్ స్వీకరించారు. సిబ్బంది పుష్పమాలతో కమాండర్ దాస్, ఆయన సతీమణి పింకీ ప్రధాన్‌లకు పదవి విరమణ అభినందనలు తెలియజేశారు. నూతన కమాండర్ నితిన్ మోహన్ అగర్వాల్ మాట్లాడుతూ కాకినాడ హెడ్ క్వార్టర్స్‌కు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ గ్రూపునకు మరింత పేరు తీసుకువస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో 13 యూనిట్ల ఎన్‌సీసీ అధికారులు, కాకినాడ గ్రూప్ అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలతోనే ప్రమాదాల నివారణ

పిఠాపురం: ప్రమాదాలు నివారించడానికి మోటారు వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పిఠాపురం అదనపు జిల్లా జడ్జి ఏ వాసంతి తెలిపారు. బుధవారం కోర్టు ఆవరణలో మోటారు వెహికల్ యాక్టుపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మోటారుసైకిల్ పై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. కారులో తప్పని సరిగా ఎయిర్ బ్యాగ్స్ ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రభుత్వం కఠినమైన చట్టాలు అమలు చేస్తోందని చెప్పారు. సదస్సులో సబ్ జడ్జి ఎం.బాబు, జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.విజయ రామేశ్వరి, బార్ అధ్యక్షులు ఎం.రాజారావు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఐడియల్'లో ప్లేస్‌మెంట్ డే వేడుకలు



ఐడియల్ కళాశాలలో పాల్గొన్న అధికారులు

బాలాజీచెరువు: ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్లేస్‌మెంట్ డే వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ సీఎస్ఈ, ఈసీఈ, మెకానికల్, సీఎస్ఈ ఆర్టిఫిషియల్, మెషీన్ లెర్నింగ్ విద్యార్థులు 91శాతం ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందని, రెగ్యులర్ సిలబస్‌తో పాటు సీఆర్‌టీ (క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్) శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. కళాశాలలో గ్రంథాలయంతో పాటు స్పోర్ట్స్, ల్యాబ్ వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులకు సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి, డైరెక్టర్ కృష్ణంరాజు, ఏవో వర్మ, పీఆర్‌ఓ సాయిబాబు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

తాళ్లరేవు: చినగోవలంక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సుంకరపాలెం మాజీ సర్పంచ్ మోపూరి శ్రీనివాస కిరణ్ విద్యా సామగ్రి అందజేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస కిరణ్ ఆర్థిక సహకారంతో పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర వాటిని పంపిణీ చేశారు.

ప్రమాదకర కర్మాగారాల తనిఖీ



వాకలపూడిలో స్టోరేజ్ ట్యాంకులను పరిశీలిస్తున్న రాధాకృష్ణ తదితరులు

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామంలో ప్రమాదకర కర్మాగారాలు, ప్రమాదకర పదార్థాలు నిల్వ ఉంచే స్టోరేజ్ ట్యాంకులను అధికారులు బుధవారం తనిఖీ చేశారు. జిల్లా కలెక్టరు షాన్ మోహన్ సగిలి ఆదేశాల మేరకు ఈ తనిఖీ చేపట్టామని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ తెలిపారు. వాకలపూడి గ్రామంలో పోర్ట్ రోడ్డులో ఉన్న మహతి స్టోరేజ్ టెర్మినల్‌ను పరిశీలించారు. ప్రమాదకర పదార్థాలను నిల్వ చేస్తున్న స్టోరేజ్ ట్యాంకులు వద్ద సెన్సర్ ఏర్పాటు, ఆపరేషన్ పద్ధతులు, ప్రమాదం వాటిల్లితే మంటలు ఆర్పేందుకు ఫోమ్ వ్యవస్థ గురించి ఆయనతో పాటు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మురళీకృష్ణ సిబ్బందికి అవగాహన కల్పించారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ

పెద్దాపురం: వాహనచోదకుడు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రతి ఒక్కరికి ప్రాణ రక్షణ ఉంటుందని డీఎస్పీ లతాకుమారి అన్నారు. రవాణా శాఖ, పోలీస్, న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం రవాణా శాఖాధికారి హరినాథరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతన్న రోడ్డు ప్రమాదాల్లో వాహనచోదకుల మృతుల్లో కేవలం హెల్మెట్ లేక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చోటు చేసుకుంటున్నారు. విధిగా ప్రతి ఒక్క వాహనచోదకుడు హెల్మెట్ ధరించాల్సిందేనని ఆమె అన్నారు.

మైకాసుర వధకు ముందడుగేద్దాం

- తూతూ మంత్రంగా పాలిథిన్ నిషేధం
- అధికారుల చర్యలు దాదాపు శూన్యం
- నెత్తిన పెట్టుకున్న ప్రజలే త్యజించాలి



ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటి నియంత్రణకు చేసిన చట్టాలను పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెద్దాపురం: మానవాళి ఆదరణ పొంది.. ఆ తరువాత ఆ జాతినే అథఃపాతాళానికి తొక్కేసేంతలా ఎదిగిపోయిన నిత్యావసర వస్తువు పాలిథిన్ కవర్. కాబట్టి వాటిని ఆదరించిన మనమే వాటిని వినియోగించకుండా ఉంటే ఆదరణ లేని ఏ వస్తువైనా మనలేదని తెలుసుకుని ఉత్పత్తిదారులు ఆ సంచుల తయారీని ఎప్పటికో అప్పటికి ఆపేస్తారు. తక్కువ మైక్రాన్ల సంచులు పర్యావరణానికి హాని కలిగిస్తాయని, వాటిని నిషేధించాలని దాదాపు అన్ని దేశాలు పాలిథిన్ వినియోగంపై సమరం ప్రకటించాయి. కానీ అమలులో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోతున్నాయి. మన దేశంలో అందునా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధం శూన్యమనే చెప్పాలి. ఎవరికి వారు యథేచ్ఛగా వినియోగిస్తున్నా నిషేధాన్ని అమలు చేయాల్సిన అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు.

వినియోగించి పారేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు భూములో కలవడానికి వందల ఏళ్లు పడుతుంది. అంతవరకు ఈ వ్యర్థాలు భూ పై పొరల్లో పేరుకుపోయి భూ వాతావరణాన్ని వేడెక్కిస్తూ, వర్షాకాలాల్లో కురిసే వాన నీటిని భూమిలోనికి ఇంకనీయకుండా అడ్డుకుని మానవాళికి తీవ్రమైన చేటుచేస్తున్నాయి.

క్యాన్సర్ కారకం..

పాలిథీన్ వస్తువుల్లో విక్రయించే ఆహారాన్ని తీసుకోవడం వల్ల ప్లాస్టిక్‌లోని రసాయనాలు అవశేషాలు మనం లోనికి తీసుకునే ఆహారంతో లోపలికి వెళ్లి క్యాన్సర్ కారకంగా తయారవుతున్నాయి. ఇరవై మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉండే పాలిథిన్ కవర్లను వినియోగిస్తే క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువని వైద్యులు చెబుతున్నారు.

ఆరోగ్య సమస్యలు వస్తాయి



పాలిథిన్ సంచుల వినియోగం వల్ల వాటిలోని ప్రమాదకరమైన రసాయనాలు ప్రజలకు ఆరోగ్యపరమైన సమస్యలు తీసుకువచ్చే అవకాశం ఉంది. వీటి వినియోగంపైన ప్రజలు ఎవరికివారే చైతన్యం కావాలి.

– డాక్టర్ జగదాంబ, ఏరియా ఆసుపత్రి వైద్యులు, పెద్దాపురం